క్లుప్తంగా

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న మాజీ సర్పంచ్ రాములు, తదితరులు

షాబాద్: పేద విద్యార్థులకు దాతలు సాయం చేసి ప్రోత్సహించాలని రేగడిదోస్వాడ మాజీ సర్పంచ్ రాములు, ఎంపీటీసీ పార్వతమ్మరాం చంద్రయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలో గ్రామస్తుడు కుమ్మరి శ్రీనివాస్ విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థులకు కావాల్సిన మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అందరూ సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజారత్నం, రామారావు, రాజు, శేఖర్, జంగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

కార్యకర్తలను ఆదుకుంటాం



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: మండలంలోని అంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఈగ సురేందర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం షాబాద్‌లో జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి సురేందర్‌రెడ్డి కుటుంబానికి తన వంతు సాయంగా రూ.3లక్షలు అందజేశారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ పార్టీ తరఫున బీమా డబ్బులు రూ.2లక్షలు గతంలో అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆపదలో ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కోట్ల మహేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



బడిబాటలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీఓ

కొత్తూరు: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, భవిష్యత్‌లో చదువుకున్న వారికే అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉంటుందని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బడిబాటలో భాగంగా ఆయన పలువురు అధికారులతో కలిసి గురువారం మండలంలోని మక్తగూడ, గూడూరు, మల్లాపూర్‌తాండ, పెద్దగుట్టతాండల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఆయనతో పాటు అధికారులకు పూలతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తాము నిర్దేశించుకున్న లక్ష్యసాధనకు అహర్నిషలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, ఎంఈఓ కృష్ణారెడ్డి, నాయకులు దయానంద్‌గుప్తా, రాందాస్‌నాయక్, మోడి దర్శన్, రాజుగౌడ్, దయానంద్‌రెడ్డి, శ్రీను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

కందుకూరు: తెలంగాణ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు మహేశ్ డిమాండ్ చేశారు. గురువారం కళాకారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాలికి గజ్జ కట్టి, గోసి గొంగడేసి గ్రామ గ్రామాన తిరిగి ఉద్యమంలో గొంతెత్తి ధూం ధాం లాడిన ఆట గొంతులు మూగబోతున్నాయన్నారు. గ్రామీణ కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. గత ప్రభుత్వం కళాకారులకు ఉద్యోగంతో పాటు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ప్రస్తుతం ఎంతో మంది ఉద్యమంలో పని చేసిన కళాకారులకు తినడానికి కనీసం తిండి, ఉండటానికి ఇల్లు కూడా లేదన్నారు. ప్రభుత్వం స్పందించి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జంగన్న, శివకుమార్, కిరణ్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు

నాగర్‌గూడ నుంచి హైతాబాద్ వరకు పూర్తిగా అధ్వానం



గుంతలమయంగా రుద్రారం రోడ్డు



- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

షాబాద్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి నిత్యం వందలాది మంది వాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. రాత్రిపూట రోడ్లపై రాకపోకలు సాగించాలంటేనే నరకయాతనగా ఉందని పేర్కొంటున్నారు. మండల పరిధిలోని నాగర్‌గూడ, రుద్రారం, మీరాపూర్, మన్‌మర్రి, పోతుగల్ నుంచి మాచన్‌పల్లి వరకు, మల్లారెడ్డిగూడ నుంచి ఎర్రోనిగూడ వరకు, రేగడిదోస్వాడ నుంచి బొబ్బిలిగామ వరకు వెళ్లే దారులు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ఆ రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలిచి రోడ్లు నీటిమడుగులను తలపిస్తున్నాయి. అధికారులు, పాలకులకు స్థానికులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అడుగడుగునా గుంతలు..

మండలంలోని నాగర్‌గూడ, రుద్రారం, హైతాబాద్ వరకు రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో గుంతలు వరదనీటితో నిండి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. నాగర్‌గూడ, రుద్రారం నుంచి వందలాది మంది ప్రజలు నిత్యం ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం శంషాబాద్, షాబాద్, చేవెళ్లకు వెళ్తుంటారు. నిత్యం గుంతల రోడ్డుపై ప్రయాణం చేయడంతో మెన్నునొప్పి, నడుమునొప్పి వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఎర్రొనిగూడ, మీరాపూర్, బొబ్బిల్లిగామ గ్రామాల రోడ్లు వర్షాలకు పూర్తి దెబ్బతిన్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రజలు జంకుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ దివ్యశ్రీని వివరణ కోరగా.. ఈ రోడ్డు పనులు పరిశ్రమల యాజమాన్యాలు నిర్వహిస్తున్నారని, అది ప్రభుత్వానికి సంబంధం లేదని చెప్పారు. పరిశ్రమల సభ్యులను అడిగి పనులు పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి



రుద్రారం గ్రామ రోడ్డుపై అధికంగా గుంతలు ఉండడంతో రాత్రివేళల్లో ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంటుంది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని అధికారులకు చాలా సార్లు విన్నవించాం. అయినా రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రుద్రారం రోడ్డుపై పడిన గుంతలను పూడ్చివేయాలి.

–సంజీవరెడ్డి, రుద్రారం, షాబాద్ మండలం

గుంతలు పూడ్చాలి..



అంతారం స్టేజీ నుంచి మన్‌మర్రి వరకు రహదారిపై అనేక గుంతలు ఏర్పడ్డాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రాత్రివేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. రెండు సంవత్సరాలుగా ఈ రోడ్లపై ప్రయాణం చేస్తున్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా రోడ్ల తీరు మారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

–బండ నర్సింహారెడ్డి, మన్‌మర్రి, షాబాద్ మండలం

ఎమ్మెల్సీకి ఘన స్వాగతం



కొత్తూరు: ర్యాలీలో విజయకేతనం చూపుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి తిమ్మాపూర్ చౌరస్తాలో గురువారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, అనుచరులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్సీగా హైదరాబాద్‌లో ప్రమాణస్వీకారం తర్వాత మండలానికి రావడంతో పెద్ద సంఖ్యలో నాయకులు, అనుచరులు పూలమాలలు, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. పట్టణంలో ఆయన అభిమానులు, నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ వైజంక్షన్ కూడలిలో ఉన్న అంబేడ్కర్, తెలుగుతల్లి, పట్టణంలోని పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, శివాచారి, సాగర్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సన్మానం

షాద్‌నగర్‌రూరల్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రమాణం స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చేరుకున్న నవీన్‌కుమార్ రెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. గజమాలతో ఘనంగా సన్మానించారు. పట్టణ ముఖ్యకూడలిలో బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. చౌరస్తాలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి నవీన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో నవీన్‌కుమార్‌రెడ్డి అభివాదం చేస్తూ ముందుకుసాగారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిమ్స్ ఆసుపత్రి వైద్యులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వద్దు, శబ్ద కాలుష్యం తగ్గిద్దాం శతాబ్ది కాలం జీవిద్దాం అంటూ ప్లకార్డులతో ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిమ్స్ వైద్యులు డాక్టర్లు పూనమ్‌సుతర్, విరాజ్‌కుమార్, జిమ్స్ మెడికల్ కళాశాల సోషల్‌వర్కర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

సంత.. వాహనదారుల చింత



పుల్సుమామిడిలో కూరగాయల సంత

- రోడ్లపైనే కూరగాయల విక్రయాలు
- షెడ్‌లు నిర్మించాలని స్థానికుల వినతి
- పట్టించుకోని అధికారులు

కొందుర్గు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వారంతపు సంతలకు భలే గిరాకీ ఉంది. వారాంతపు సంతలు తాజా కూరగాయలకు కేరాఫ్‌గా మారాయి. అదేవిధంగా ఈ సంతల్లో కూరగాయలు చౌకగా లభిస్తాయని పరిసర గ్రామాల ప్రజల నమ్మకం. రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలను ఈ వారంతపు సంతలకు తీసుకెళ్లి రోడ్లపై పెట్టుకొని విక్రయిస్తారు. ఇక వినియోగదారులు ఈ సంతల్లో తాజా కూరగాయలను తీసుకెళ్తుంటారు.

మండల కేంద్రంలో ఇలా..

కొందుర్గు మండల కేంద్రంతో పాటు పుల్సుమామిడి, తంగెళ్లపల్లి, ముట్పూర్ గ్రామాల్లో కూరగాయల సంతలు నిర్వహిస్తారు. ఈ సంతలకు పరిసర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తారు. అదేవిధంగా జిల్లేడ్‌చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడ, గాలిగూడ, జాకారం గ్రామాల్లో కూరగాయల సంతలు ఏర్పాటు చేస్తారు. చౌదరిగూడ, పుల్సుమామిడి, ముట్పూర్ గ్రామాల్లో కూరగాయల దుకాణాలను రోడ్లపైనే పెట్టడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం వారాంతపు సంతలకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించి షెడ్లు నిర్మించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో కొందుర్గు, చౌదరిగూడ సంతలకు నిర్వహణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కాని ఎలాంటి మంజూరు ఉత్తర్వులు అందలేదని ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు అంటున్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



శంకర్‌పల్లి: విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని శ్రీరాంనగర్ ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రాంరెడ్డి చేతులమీదుగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ఉచితంగా అందజేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంగయ్య, ఉపాధ్యాయులు ప్రవీణ్, రవి, ఉమాదేవి, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ వినోద, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

శంకర్‌పల్లి: విద్యార్థులు కష్టపడి చదివి తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ఆకాంక్షించారు. గురువారం శంకర్‌పల్లి మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డితో కలిసి ఆమె అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్వేత, హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

హెచ్‌ఎం జయమ్మ



రాధికను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: ఉద్యోగులు తమ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని హెచ్‌ఎం జయమ్మ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ జెడ్పీ హెచ్‌ఎస్‌లో తొమ్మిది సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రాధిక పదోన్నతిపై నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రాధికను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ.. బోధనలో రాధిక ఉత్తమ ప్రతిభను కనబరిచి విద్యార్థులు, తల్లితండ్రుల మన్ననలు అందుకున్నారని పేర్కొన్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందిన రాధిక భవిష్యత్‌లో మరెన్నో పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతి కల్పించడం అభినందనీయం

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య



హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడం సంతోషించదగ్గ విషయమని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులును ఎస్‌టీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆంజనేయులకు స్వాగతం పలుకుతూ సన్మానించారు. హిమాయత్‌నగర్ పాఠశాలలో పని చేసిన అనంతరెడ్డి గత సంవత్సరం నవంబర్ నెలలో అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా కొనసాగింది. ప్రస్తుతం ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంలో భాగంగా మేడ్చెల్ జిల్లా వెంకటాపూర్ యూపీహెచ్ పాఠశాలలో 2018 నుంచి ఈరోజు వరకు పని చేసిన ఆయన ఏడు సంవత్సరాల పాటు ఉపాధ్యాయులుగా కొనసాగారు. ప్రభుత్వం పదోన్నతి కల్పించిన వారిలో ఈ పాఠశాల ఉపాధ్యాయుడు ఆంజనేయులుకు హెచ్‌ఎంగా పదోన్నతి కల్పించడంతో గురువారం హిమాయత్‌నగర్ పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పోస్టు రావడంతో బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు విద్యార్థుల అభివృద్ధికి, పాఠశాల బలోపేతానికి తోటి ఉపాధ్యాయులతో కలిసి సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యాయులు అరుణ, కళావతి, మంజుల, బిలాల్, గోవర్ధన్, నీలిమ, మమత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై చర్యలేవీ?

విద్యుత్ అధికారుల తీరుపై ఎంపీటీసీల ఆగ్రహం



రెడ్డిపల్లిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఫోన్ ద్వారా చూపిస్తున్న ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్

మొయినాబాద్‌రూరల్: ఎంపీటీసీల కాలం త్వరలో ముగిస్తుందని, ఐదు సంవత్సరాలు గడుస్తున్నా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయని మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మోర శ్రీనివాస్‌తో పాటు పలువురు ఆరోపించారు. గురువారం మొయినాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ సంధ్య అధ్యక్షతన నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశం చివరిది కావడంతో 17 మంది ఎంపీటీసీలకుగాను 12 మంది ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ నెల 3వ తేదీన సర్వసభ సమావేశం ఏర్పాటు చేయగా కేవలం నలుగురు ఎంపీటీసీలు రావడంతో వాయిదా వేసి గురువారం తిరిగి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకటయ్య గ్రామాల్లో ఉన్న పాఠశాలలు, విద్యార్థుల వివరాలను తెలియజేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులు గ్రామాల్లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మోర శ్రీనివాస్ విద్యుత్ సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలు మరింత పెరిగాయని తెలిపారు. గడిచిన సర్వసభ్య సమావేశంలో ఈ అధికారులకే రెడ్డిపల్లిలో కరెంటు షాక్ వస్తుందని, పిల్లలు తిరుగుతున్నారని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని నిలదీశారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఇలా అనేకంగా సమస్యలు ఉన్నా పరిష్కారంపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. రెడ్డిపల్లిలో ఉన్న సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని ఏఈలు అమైయ్‌నాయక్, రాజులు తెలపడంతో విద్యుత్ సమస్య సద్దుమనిగింది. అదేవిధంగా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ గ్రామాల రోడ్ల పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎలక్షన్ల ముందు ఆర్భాటంగా శిలాఫలకాలు వేసి పనులు ప్రారంభించారని శ్రీరామ్‌నగర్ ఎంపీటీసీ రాంరెడ్డి పంచాయతీరాజ్ ఏఈ రమ్యకు సూచించారు. మొయినాబాద్ శ్రీరామ్‌నగర్ వెళ్లే దారిలో కొంత దూరం సీసీరోడ్డు వేశారని ఆ సీసీ రోడ్డు పగిలిపోతుందన్నారు. అదేవిధంగా రోడ్డు పోసిన వెంటనే అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మట్టిని వేయకపోవడంతో ఈ రోడ్డు ఇలా పగిలిపోతుందన్నారు. స్పందించిన ఏఈ రమ్య మాట్లాడుతూ.. త్వరలో కాంట్రాక్టర్‌తో మట్టిని పోసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిపోయిందని అతడిని ప్రశ్నిస్తే డబ్బులు రావడం లేదని తెలుపుతున్నారని తెలిపారు. పైఅధికారులకు సమస్యను వివరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ నక్షత్రంజేవంతు మాట్లాడుతూ.. అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మోర శ్రీనివాస్, ఎంపీటీసీలు రాంరెడ్డి, సుజాత, మల్లేశ్, లతనాగరాజు, ప్రభావతి, అర్చనయాదయ్య, పద్మమ్మ, అంజయ్య, బిలాల్, అధికారులు విద్యుత్ ఏఈలు అమైయ్‌నాయక్, రాజు, ఎంఈఓ వెంకటయ్య, పంచాయతీరాజ్ ఏఈ రమ్య, ఏఓ రాగమ్మ, పంచాయతీ కార్యదర్శులు తారాబాయి, రంజిత్‌కుమార్, వెంకటేశ్, లావణ్య, సంధ్యారాణి, శివకుమార్, మహేశ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.